



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 29 మే 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2





# బాధితురాలుకు అండగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**– గాలి దుమారానికి ఇల్లు కోల్పోయిన బాధితురాలికి తక్షణమే ఇల్లు మంజూరు**



భానుపురి/సూర్యాపేట టౌన్

జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల బీభత్సానికి సర్వస్వం కోల్పోయి నిలువ నీడ లేక రోడ్డున పడ్డ ఒక వృద్ధురాలి దీనస్థితికి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చలించిపోయారు. గాలి దుమారానికి రేకుల ఇల్లు ఎగిరిపోయి, ఆశ్రయం కోల్పోయిన ఆ బాధితురాలికి తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ని ఆదేశించారు. జిల్లాలోని మట్టంపల్లి మండలం పెద్దవీడు లాల్ తండా గ్రామంలో గాలి దుమారం కారణంగా తాళ్లూరి జయమ్మ నివాసం ఉంటున్న రేకుల ఇల్లు పైకప్పు రేకులు గాలికి కొట్టుకుపోవడంతో, ఆమె నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. వృద్ధాప్యంలో తలదాచుకోవడానికి చోటు లేక ఆమె పడుతున్న అవస్థల గురించిన విషయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి వచ్చింది. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధితురాలి పరిస్థితిపై తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. బాధితురాలికి తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆమెకు ప్రకృతి వైపరీత్యాల కింద ఇల్లు తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు




## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



భానుపురి/సూర్యాపేట టౌన్

ఈద్గా లో బక్రీద్ పురస్కరించుకుని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. అవసరమైన వారికి సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం బక్రీద్ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో కలిసి జీవించాలని ఈద్ ఉల్ అజ్హా పండుగ చాటి చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టి ఆర్ కు భారతరత్న ఇవ్వాలి





భానుపురి /సూర్యాపేట టౌన్

మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, సినీ నటులు నందమూరి తారక రామారావుకు వచ్చే జయంతి వరకు భారతరత్న ఇవ్వాలని, ఆయన జీవితం భావి తరాలకు ఆదర్శప్రాయమని ఎన్టీఆర్ అభిమాని, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నల్లాల బావి చౌరస్తా నందు డిసిసి కార్యదర్శి, ఎన్టీఆర్ అభిమాని నేరేళ్ళ మధు గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు ఏళ్లకు పైగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని దేవుడి పాత్ర ఏదైనా ఆ పాత్రకు వన్నె తేవడమే కాక, ఆ రూపం నిజమైన దేవుడేనని నమ్మేంతగా పాత్రలో ఒదిగిపోయే వ్యక్తి ఎన్ టి ఆర్ అని, పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల అవస్థలను తెలుసుకుని తాలుకాలను రద్దు చేసి, మండలాలుగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్య దైవంగా భావించే వ్యక్తి ఆయన అని, క్రమశిక్షణకు మారుపేరు, ఆయన పేరంటేనే ఒక విప్లవం అని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి సేవలను గుర్తించి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ భారతరత్న ఇవ్వాలన్నారు. తెలుగు జాతి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్, డిసిసి కార్యదర్శి షేక్ మీరా, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలెబోయిన నర్సయ్య, కొండగడుపుల సూరయ్య,శ్రీపాది శంకర్, పొదిళ్ళ హరి, జితేందర్, బాణాల హరి, ఎల్గూరి వెంకటేశ్వర్లు, కొండా రాజేష్, నేరెళ్ల నరేష్, జాని మీయా, గుణగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్ నందు ఈ నెల 29 శుక్రవారం నిర్వహించే ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుక్కడపు శ్రీనివాస రావు విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 31 న జరిగే ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని అభ్యర్థించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనవంతుగా సహాయసహకారాలు అందజేస్తానన్నారు. తన మేనిఫెస్టో లో ప్రకటించిన హామీలన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. తన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు కుక్కడపు జానకీ రామయ్య ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, ఆయన వారసుడిగా అవే సేవాకార్యక్రమాలు చేస్తూనే పేద ఆర్యవైశ్యులకు ఆర్థిక చేయూత అందజేస్తాని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో తాను అభ్యర్థిగా బరిలో ఉండగా కొందరు పెద్దలు తన పదవిని వేరొకరికి ఇవ్వమనటంతో వారి అభ్యర్థనను కాదనకుండా తప్పుకున్నానని, ఈ సారి నిర్వహించే ఎన్నికల్లో తనకు తప్పకుండా మద్దతు ఇస్తామని చెప్పిన నాటి పెద్దలు ఆ మాట తప్పారని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే ఈ ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తనను ఆర్యవైశ్యులంతా కలిసి అత్యధిక మెజారిటీ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి రవీందర్, వాసా నరసింహారావు, రేపాల యాదగిరి, కర్నాటి వంశీ, బొమ్మిడి శ్రీను, దేవరశెట్టి రాజా, చెక్క లక్ష్మయ్య లు పాల్గొన్నారు.

## బక్రీదు సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జానీ భాయ్



భానుపురి/సూర్యాపేట రూరల్

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ నూర్ భాషా సంఘం ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర నాయకులు నూర్ భాషా కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 48వ వార్డ్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఫరూక్, ముదిరెడ్డి రమణారెడ్డి పిల్లల రమేష్, పలగాని కృష్ణ తదితరులు ఉన్నారు.

# సీపీఐ(ఎం-ఎల్ ) మాస్ లైన్ "పాదయాత్ర" ను జయప్రదం చేయండి

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం జూన్ 2వ తేదీ నుండి సిపిఐ (ఎం.ఎల్)మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలంటూ సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్లో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ అలుపెరగని ఉద్యమ పోరాటాలతో రాటు తేలిన, ఎట్టి పనులు చేసే మట్టి జీవులకు పోరాటాల పాలు తాపిన, ఎందరో ఉద్యమకారులకు జన్మనిచ్చిన సూర్యాపేట నేడు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నదని, సమస్యల పరిష్కారం కోసం మరొకమారు ఉద్యమాల బాట పట్టాల్సిన సమయం ఆసన్నమైనదని ఆయన అన్నారు. నాటి అమరవీరులు అందించిన ఉద్యమ స్ఫూర్తిని మదినిండా తలుచుకొని, ఈనాటి సమస్యలపై ప్రతి ఒక్కరు గల మెత్తవలసిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడినారు. అభివృద్ధి పేరుతో జనావాసాల మధ్య విషవాయువులు వెదజల్లుతున్న ఫ్యాక్టరీలు ఒకవైపు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ఆలస్యంతో అతుకుల గతుకుల రోడ్ల మధ్య కాళ్లు చేతులు విరగొట్టుకుంటున్న జనాభా గోడుతో మరొకవైపు నేడు సూర్యాపేట ప్రజలు సతమతం అవుతున్నారని అన్నారు. వాయు కాలుష్యం,జల కాలుష్యంతో రోగాల బారిన పడిన పీడిత ప్రజలు హాస్పిటల్ కి వెళ్ళగానే ప్రభుత్వ హాస్పిటల్స్ లో సమస్యలు దర్శనమిస్తాయని, ప్రైవేట్ హాస్పిటల్స్ లో మెడికల్ మాఫియా రాజ్యమేలుతుందని ఆయన అన్నారు. ఆరుగాలం కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకొని తనలాగా తమ పిల్లలు కష్టపడకూడదు అని ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షిస్తున్న తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల,కళాశాలలో నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. పొట్ట పోషణ కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న చిన్న వ్యాపారస్తులకు అడ్డాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇవేగాక పట్టణంలో అనేక దైనందిన సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలను కలిసి ఆ సమస్యల పరిష్కారం కోసం నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసుకోవడం కోసం జూన్2వ తేదీ నుండి పట్టణంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర కార్యక్రమం జరుగుతున్నదని, ఈ పాదయాత్రను ప్రారంభించుటకు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, నిజాయితీకి నిలువెత్తు ఆదర్శమైనటువంటి కామ్రేడ్ గుమ్మడి నరసయ్య వస్తున్నారని ఆయన తెలియజేశారు. కావున ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్ర జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జూన్ రెండవ తేదీ ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ నుండి మున్సిపాలిటీ ఆఫీస్ వరకు ర్యాలీ ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కారింగుల వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎర్ర అఖిల్ కుమార్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపికెఎంఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ పేర్ల నాగయ్య, పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు భీమనపల్లి ప్రకాష్, పార్టీ నాయకులు మోహన్, కట్ట రమేష్, వేణు, శ్రీనాద్,పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ బెదిరింపులకు భయపడం




భానుపురి /సూర్యాపేట టౌన్

రాజకీయ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని,చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డుపెట్టుకొని సిపిఎం నాయకత్వాన్ని బలహీనపరచలేరని, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్ల బావి సెంటర్ లో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పై ఈడి దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి,కాంగ్రెస్ కలయికతో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ పై చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డం పెట్టుకొని దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనని అన్నారు. రాష్ట్రానికి 15 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసి,నీతివంతమైన, ఆదర్శవంతమైన పాలన అందించిన వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా అవమానపరచడానికి ఆయనతో పాటు కుటుంబ సభ్యులపై ఏకకాలంలో ఈడి దాడులు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈడి చెబుతున్న ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ గారి గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులు సమర్ధనీయం కాదని విమర్శించారు. ప్రస్తుత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి లక్షల కోట్ల రూపాయల కుంభకోణం చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అవినీతిపరులు, అక్రమార్కులు బిజెపిలో చేరగానే పునీతులు అవుతున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, దేశం కోసం పోరాడుతున్న వారు మాత్రం బిజెపి వారి దృష్టిలో అవినీతిపరులవుతున్నారని విమర్శించారు. తమ రాజకీయ ప్రత్యర్థులైన అరవింద్ కేజ్రీవాల్, శిబు సొరేన్,మనీష్ సిసోడియా, వంటి వారిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక వారిపై కూడా అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపులకు దిగిందని విమర్శించారు. సమగ్ర విచారణ జరిగిన తర్వాత, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ కేవలం రాజకీయ ప్రతీకారంతో బిజెపి, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వం చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థల దుర్వినియోగాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. పినరయి విజయన్ కూతురుకు సంబంధించినటువంటి కంపెనీ వ్యవహారంలో పినరై విజయన్ కు ఎలాంటి సంబంధం లేదని గతంలో కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా బిజెపి, కాంగ్రెస్ కలిసి ఈ దాడులు చేయించడం సరైనది కాదని అన్నారు. రాజకీయ వేధింపుల ద్వారా, సిపిఎం నాయకత్వాన్ని అక్రమ కేసులలో ఇరికించడం ద్వారానో బలహీనపరచలేదని ప్రజా ఉద్యమాలు నిర్మించి లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ద్వారా బలపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు,కోట గోపి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏలుగురి గోవింద్, మేకనబోయిన శేఖర్ సిపిఎం రూరల్ మండల కార్యదర్శి మెరెడ్డి కృష్ణారెడ్డి,సూర్యాపేట 3 టౌన్ కార్యదర్శి చిట్లింకి యాదగిరి నాయకులు బోల్ల నాగేందర్ రెడ్డి,మామిడి సుందరయ్య ధనమూర్తి,సాగర్, సైదులు తదితరులు...

# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి

భానుపురి /సూర్యాపేట టౌన్



బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ అనంతరం ముస్లిం సోదరులను మర్యాదపూర్వకంగా కలుసుకొని వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్ర ఖురాన్ బోధించిన జకాత్, ఫిత్రా వంటి సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ, పేదల ఆకలి తీర్చే గొప్ప పండుగ బక్రీద్ అని పేర్కొన్నారు. సహనం, త్యాగం, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ బక్రీద్ పండుగను శాంతి, కరుణ, సామరస్యం, ఐకమత్యం, సోదరభావం స్ఫూర్తితో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి రమణారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మున్సిపల్ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న పిల్లల రమేష్ భవాని నాయుడు షేక్ ఫారుఖ్ పలగాని కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్సాద్ దేవేందర్ తండు శ్రీనివాస్ యాట ఉపేందర్ మర్ల కరుణాకర్ దండ అరవింద్ రెడ్డి ధరావత్ ధర్మ జానీ కుంచం అంజయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాసింపేట 4వ వార్డులో ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ ప్రారంభం

భానుపురి/సూర్యాపేట టౌన్



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని కాసింపేట 4వ వార్డులో ఘనంగా ప్రారంభించారు.మున్సిపల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వార్డ్ కౌన్సిలర్ భూక్య జ్యోతి, కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ ఎం.ఏ. వాజిద్ మియా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొదిల రాములు , యడవల్లి బిక్షం, అలిశెట్టి రమేష్ , యడవల్లి ముత్తయ్య , దామోదర్ రెడ్డి, సోమిశెట్టి లింగయ్య, బైరగోని విజయ్, ఎస్.కె. నజీర్, మదర్ సాబు , వెంకటాచారి గారు, శ్రీనివాస్ రెడ్డి, పాషా, ఆజార్ , జటోత్ బాలు, సురేష్ , పాండు , శరత్ తదితరులు పాల్గొన్నారు.దఅలాగే మెప్మా సిబ్బంది, ఆర్పీలు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలకు చీరలను పంపిణీ చేస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# బక్కని నర్సింహులు దిష్టిబొమ్మ దహనం

భానుపురి /సూర్యాపేట టౌన్



తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడినందుకు టీటీడీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, పొలిట్బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు దిష్టిబొమ్మను తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ, మంగళగిరిలో జరిగిన టీడీపీ మహానాడులో బక్కని నర్సింహులు "తెలంగాణ అనే పదం డిక్షనరీలో లేదు" అని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. "తెలంగాణ అనేది డిక్షనరీలో వెతికే పదం కాదు. ఇది నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవ పోరాట ప్రాంతం. వందల ఏళ్ల క్రితమే త్రిలింగదేశంగా వర్ధిల్లింది. తెల్లాపూర్ శాసనంలో కూడా తెలంగాణ ప్రస్తావన ఉంది. చరిత్ర చదవకుండా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు" అని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు బక్కని నర్సింహులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాషిపంగు సునీల్, అధికార ప్రతినిధి ఏనుగు సంతోష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా నాయకులు దారవత్ వెంకటేష్ నాయక్, జక్కలి గోపి, చింతకాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ డ్రైనేజీ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



పట్టణంలో గత కొన్ని నెలలుగా చేపట్టిన అండర్ డ్రైనేజీ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం టిఆర్పీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నవంబర్లో టిఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేసినా ఇప్పటివరకు 48 వార్డుల్లోని వీధులన్నీ గుంతలతో ఉన్నాయని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ నుంచి వర్షాలు, జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, స్కూల్ వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. వర్షాలు ప్రారంభం కాకముందే మరమ్మతులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో టిఆర్పీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ మండల అధ్యక్షుడు బొల్లె సైదులు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమ గాని లింగస్వామి, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య యాదవ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోల కరుణాకర్, వల్లాల సైదులు, ఆరాల రమేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు సూపర్ సైదులు, బోడపట్ల మధు గౌడ్, చింతల మురళి, వట్యాల శేఖర్,కాంటేకార్ రఘుమోహన్, దీపమాల, వర్రె కవిత యాదవ్,గుండారపు సంజన ఆర్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు

# తెలుగు సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ

## నటీనటులకు, కవులకు,కళాకారులకు, ప్రాధాన్యత ఇవ్వాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

నిర్మిస్తున్న ప్రతి సినిమాలో టీవీ సీరియల్ లో టీవీలలో ప్రచారం అవుతున్న ప్రతి కార్యక్రమాలలో తెలంగాణ వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని సీనియర్ పాత్రికేయులు కవి రచయిత కందుకూరి యాదగిరి గురువారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రత్యేక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు చెందిన ఎంతోమంది కళాకారులు కవులు రచయితలు కావలసినంత టాలెంట్ ఉన్నప్పటికీ ఆంధ్ర వారికి సినిమాలలో వచ్చినంత గుర్తింపు తెలంగాణ వారికి రాలేదన్నారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన వారికి తెలుగు సినిమా ఇండస్ట్రీలో కావాల్సినంత గుర్తింపు రాకుండా పోవడానికి కారణం ఆంధ్ర పెత్తందారితనంలో సినీ ఇండస్ట్రీ కొనసాగడమే అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల నాయకత్వంలో 60 సంవత్సరాలు అన్ని రంగాలలో తెలంగాణ ప్రాంతం అంచివేతకు గురైన సంగతి అభివృద్ధికి నోచుకోని సంగతి గుర్తు చేశారు.ముఖ్యంగా తెలుగు ఇండస్ట్రీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు పెద్దలుగా వ్యవహరిస్తున్న కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కవులకు కళాకారులకు సాహిత్యకారులకు రావాల్సినంత గుర్తింపు సినిమా ఇండస్ట్రీలో రాలేదని కొంతమందికి మాత్రమే కొంతమేరకు గుర్తింపు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా కొన్ని రంగాలలో ఆంధ్ర పాలకుల పెత్తనం కొనసాగడం బాధాకరమన్నారు.తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ దీన్ని దృష్టిలో పెట్టుకొని సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కవులకు కళాకారులకు సాహిత్యకారులకు నటీనటులకు ప్రాధాన్యతను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో సృజనాత్మకత ఉండి ఎలాంటి గుర్తింపు లేని ఔత్సాహిక నటీనటులు కవులు కళాకారులు సాహిత్యకారులు రచయితలు తమలాంటి వారికి తగిన గుర్తింపుని ఇవ్వాలని కోరుతూ ఈ డిమాండ్లపై ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చే విధంగా ఉద్యమం చేపట్టేలా తమతో కలిసి రావాలని యాదగిరి పిలుపునిచ్చారు. ఈ విషయమై త్వరలోనే తెలంగాణ రాష్ట్ర సినిమా ఆటోగ్రఫీ మంత్రి ని కలుస్తామని తెలిపారు.తమతో కలిసి వచ్చేవారు ఈ క్రింది నెంబరును సంప్రదించాలని పిలుపునిచ్చారు.

